అవసరానికి.. ఆరుబయటకు వెళ్లాల్సిందే..

ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే వారు ఒకటి, రెండు అత్యవసరమైతే ఆరుబయటకు పరుగులు తీయాల్సిందే. చివరికి ప్రభుత్వ ఉద్యోగులకు కూడా అవస్థలు తప్పడం లేదు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా బహిరంగ మలమూత్ర విసర్జన వద్దని పదేపదే చెప్పే అధికారులు... కార్యాలయాల్లో వసతులను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ×ఆత్మగౌరవ€ ప్రశ్నగా మారింది. ఒకటి, రెండు అత్య వసరమైతే మూత్ర విసర్జన శాలలు, మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ఆరు బయట చాటు కెళ్లాల్సిన పరిస్థితి ఉంది. – విజయపురం



విజయపురం మండల పరిషత్ కార్యాలయం


విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించని మరుగుదొడ్లు
- పనుల కోసం వచ్చిన ప్రజలకు తప్పని తిప్పలు
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

నగరి నియోజకవర్గంలోని ప్రభుత్వం కార్యాలయాల్లో మరుగుదొడ్ల వసతులు అంతంత మాత్రంగానే ఉంది. నియోజకవర్గ స్థాయిలో మొత్తం 5 మండలాలు, రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా మండల, మున్సిపల్ కేంద్రాల్లోనూ, మండల అభివృద్ధి కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయం, ఉపాధి కార్యాలయం, పశువైద్యశాల, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మైనర్ ఇరిగేషన్, పోలీస్ స్టేషన్, హౌసింగ్, రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలన్నీ గ్రామాలకు 5 నుంచి 20 కిలో మీటర్లు దూరంలోనే ఉన్నాయి. మారుమూల ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం రోజూ దాదాపు 500 మంది ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. వీరికి అత్యవసరాలు(కాలకృత్యాలు) తీర్చుకోవడానికి మరుగుదొడ్లు లేవు. అత్యవసరమైతే గోడ చాటు కెళ్లి ముగించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మున్సిపాలిటీల్లో అక్కడక్కడా పబ్లిక్ మరుగుదొడ్లు ఉన్నా వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఆత్మగౌరవం కోసం ఇంటింటికీ మరుగుదొడ్లు అని చెప్పే అధికారులు సొంత ఇంటిని వదిలేశారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మరుగుదొడ్లు కొన్ని కార్యాలయాల్లో ఉన్నప్పటికీ వాటిని ఉద్యోగులు మాత్రమే వాడుతున్నారు. అందులో కొన్ని నిర్వహణ లేక కంపు కొడుతున్న పరిస్థితులు ఉన్నాయి. మరుగుదొడ్ల నిర్మాణంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కూడా టాయిలెట్స్ లేకపోవడం గమనార్హం. చివరికి జాతీయ బ్యాంకుల్లో సైతం మరుగుదొడ్లు లేకపోవడం గమనార్హం.

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి



బహిరంగ మలమూత్ర విసర్జన వద్దని అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తుంటారు. అదే ప్రజలు అవసరాల నిమిత్తం ప్రభుత్వం కార్యాలయానికి వచ్చినప్పుడు వారికి సరైన మరగుదొడ్లు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతుంటారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రతి కార్యాలయ పరిధిలో అవసరాల నిమిత్తం మరుగుదొడ్డి సౌకర్యాన్ని కల్పించాలి.
–గుణశేఖర్‌రెడ్డి, విజయపురం

క్లుప్తంగా

పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు


ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న ఎంఈఓ

నగరి: విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. మంగళవారం పీసీఎన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆధార్ క్యాంపును ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల వయస్సు ఉన్నవారు బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ నెల 23 వరకు తొలివిడత క్యాంపులు, 28 నుంచి 30 వరకు రెండో విడత క్యాంపులు ఉంటాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ రాజకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాతాదారులు ఈకేవైసీ చేసుకోవాలి


మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ గోమతి

పాలసముద్రం: మండల పరిధిలోని బీసీసీ బ్యాంకు ఖాతాదారులు తప్పకుండా ఈకేవైసీ చేసుకోవాలని ఆ బ్యాంకు మేనేజర్ గోమతి తెలిపారు. మంగళవారం సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో సీఈఓ వెంకటమణి ఆధ్వర్యంలో బీసీసీ బ్యాంకు ఖాతాదారులకు, రైతులకు రుణాలు, ఈకేవైసీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విచ్చేసిన బ్యాంకు మేనేజర్ గోమతి మాట్లాడుతూ రైతులకు తక్కువ వడ్డీతో పట్టా భూములు, బంగారు నగలపై రుణాలు ఇస్తామని తెలిపారు. బ్యాంకుల్లో వివిధ రుణాలు తీసుకోవాలంటే రైతులు తప్పని సరిగా ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాభాని, సిబ్బంది జయచంద్ర, రామ్‌దాస్, రైతులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న పట్టు పరిశ్రమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు గీత

శ్రీరంగరాజపురం: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరని పట్టు పరిశ్రమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు కె.గీత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పిళ్లారికుప్పం గ్రామ రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టం–2025పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ పనితీరులో పారదర్శకత వస్తుందన్నారు. రైతులు తమ సమస్యలకు సంబంధించిన సమాచారం తెలుసుకొని సమయానికి పరిష్కారం పొందడానికి ఎంతో దోహద పడుతుందని పేర్కొన్నారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిరి కల్చర్ అధికారులు ఎం.గణేష్, వెంకటలక్ష్మమ్మ, రైతులు, పట్టు పరిశ్రమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సింహ వాహనంపై ఆరేటమ్మ


సింహ వాహనంపై విహరిస్తున్న ఆరేటమ్మ

పుత్తూరు: గ్రామ దేవత ఆరేటమ్మ మంగళవారం సింహ వాహనంపై పట్టణ పురవీధుల్లో విహరించారు. ఏటా గంగ జాతరకు ముందుగా ఆరేటమ్మ బ్రహ్మోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు అమ్మవారికి భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 5 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టు పీతాంబరాలు విశేష స్వర్ణాభరణాలతో అలంకరించి సింహ వాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం విద్యుత్ దీపాల వెలుగుల్లో మంగళవాయిద్యాలు బాణాసంచా నడుమ ఊరేగించారు.

పంటల పరిశీలన

గుడిపాల: జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల పంటల పరిస్థితిని పరిశీలించేందుకు మంగళవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు రామకృష్ణారావు, సరళ, వసంత, నాగమణి, డాక్టర్ హారతి, డీఆర్‌సీ చిత్తూరు ఏఓ మాధవి, గుడిపాల వ్యవసాయాధికారి సంగీత సంయుక్తంగా కలిసి పలు గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు.

అండగా నిలవాలి

- అక్రమ కేసులు పెడితే భయపడేది లేదు
- మాజీ మంత్రి పెద్దిరెడ్డితో మాజీ ఉప ముఖ్యమంత్రి


మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాజీ ఉపముఖ్య మంత్రి నారాయణస్వామి, సమన్వయ కర్త కృపాలక్ష్మి

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా నిలిచి కూటమి పై పోరాటం చేయడానికి సిద్ధం కావాలని రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతిలోని పెద్దిరెడ్డి స్వగృహంలో ఆయనను మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. వారు చేస్తున్న అక్రమాలు, అరాచకాలను నిత్యం ఎండగట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో పోలీసులను పావుగా వాడుకొని గెలుపొందన్నారన్నారు. అనంతరం మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పేరుతో చంద్ర బాబునాయుడు ప్రజలను వంచించారన్నారు. తన పార్టీకి అనుకూలమైన వారికి పథకాలు అందిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని ఆరోపించారు.

కనువిందు.. చందనాలంకరణ


చందన అలంకరణలో వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారు

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమార గిరిపై వెలసి ఉన్న శ్రీవళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారు మంగళవారం చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారిని చందనంతో అలంకరించి, ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించి, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ ఈఓ కృష్ణనాయక్ మాట్లాడుతూ వార్షిక ఆడికృత్తిక మహోత్సవాల్లో భాగంగా ఆలయానికి రూ.13 లక్షల 23వేల 922 ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో తలనీలాల ద్వారా రూ.1,27,000, హుండీ ద్వారా రూ.3,77,262, సేవా టికెట్ల ద్వారా రూ.6 లక్షల 5వేల 660, తాత్కాలిక దుకాణాల ద్వారా రూ.6 వేలు, చందాల రూపంలో రూ.1,72,000, గత నెల తెలుగు ఆడికృత్తిక సందర్భంగా కావళ్ల ద్వారా రూ.36 వేలు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. అనంతరం ఆలయానికి విరాళాలు అందించిన దాతలకు ఈఓ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో రవియాదవ్, రాజశేఖర్, సాయి, అర్చకులు కుమార్ ఆచారి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆరేటమ్మా.. ఆదుకోవమ్మా..


మాజీ మంత్రి ఆర్కే రోజాను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు


పార్టీ నాయకులతో మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: ఆరేటమ్మా.. అందరినీ ఆపదల నుంచి ఆదుకోవమ్మా అంటూ ప్రార్థించినట్లు మాజీ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. గ్రామ దేవత ఆరేటమ్మ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం అమ్మవారికి తన స్వహస్తాలతో రోజా పాలాభిషేకం చేశారు. అనంతరం భక్తులందరినీ పాలాభిషేకానికి అనుమతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారికి స్వయంగా పాలాభిషేకం చేయడం ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయ ప్రకాష్, పట్టణ, రూరల్ పార్టీ అధ్యక్షుడు ఏకాంబరం, అన్నా లోకనాథం, కౌన్సిలర్లు జయలక్ష్మీ, భానుమతి, రాజేశ్వరి, బాలాజీ, నరసింహ, నాయకులు మనోహర్‌రెడ్డి, దిలీప్ మొదలి, కుట్టి, చిరంజీవి, శివ, మోహన్‌రెడ్డి, రాంబత్తయ్య, శివయ్య, నారాయణరెడ్డి, చిరంజీవి, గోవిందస్వామిరెడ్డి, మునిరత్నం, ప్రవీణ్, అపరంజి, మునయ్య, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

అవినీతి మచ్చ లేని నేత మాజీ ఉప ముఖ్యమంత్రి


మాట్లాడుతున్న చిత్తూరు ఉమ్మడి జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య

శ్రీరంగరాజపురం: అవినీతి మచ్చలేని ప్రజా నాయకుడు మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అని ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాభయ్యేళ్ల రాజకీయ జీవితంలో ఎక్కడా అవినీతి మచ్చలేని వ్యక్తిగా రాణించిన ఏకైక వ్యక్తి మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాత్రమేనని అన్నారు. కార్యకర్తలకు, నాయకులకు చిన్నపాటి ఇబ్బందులు వచ్చినా వెంటనే ప్రత్యక్షమయ్యే నాయకురాలు నియోజకవర్గ సమన్వయ కర్త కృపాలక్ష్మి అన్నారు. అలాంటి వారిపై కొన్ని పత్రికలు పిచ్చి వార్తలతో ప్రజల్లో అలజడి సృష్టిస్తున్నాయని, అలాంటి వాటికి స్వస్తి పలకాలన్నారు. నియోజకవర్గం మాజీ డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందన్నారు. ఆయన కుమార్తె కృపాలక్ష్మి కూడా తండ్రి అడుగుజాడల్లో నడుస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్‌ఆర్ సీపీ గ్రామాల్లో విపరీతంగా పుంజుకుంటోందన్నారు. అసత్య వార్తలు రాసే వారు మానుకోవాలని సూచించారు. మండల కన్వీనర్ మణి, సర్పంచ్ మార్కొండయ్య, నాయకులు జనార్దన్, భూపతిరెడ్డి, జయ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ నిఘా.. తస్మాత్ జాగ్రత్త

- శివారు ప్రాంతాల్లో సైతం నిఘా
- అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం
- డీఎస్పీ జి.రవికుమార్


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ రవికుమార్

పుత్తూరు: పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా ఉక్కుపాదంతో అణచివేస్తామని డీఎస్పీ జి.రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలో డివిజన్ పరిధిలోని సిబ్బందితో కలసి ఏరియా డామినేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ నేరాల నివారణ, చట్ట వ్యవస్థను పటిష్టం చేయడం, తద్వారా ప్రజల్లో భద్రతా నమ్మకాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని వివరించారు. డివిజన్ పరిధిలో ఎక్కడ నేరం జరుగుతున్నా డ్రోన్ సాయంతో సమాచారం అందుకొని తక్షణం సంఘటనా స్థలానికి సిబ్బంది చేరుకొని తగిన చర్యలు తీసుకుంటారన్నారు. గంజాయి, జూదం, మట్కా, మద్యం, బియ్యం తదితర నేరపూరిత కార్యక్రమాలను ఉక్కుపాదంతో అణచివేయడానికి తగిన ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. అలాగే హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థులు సైతం రాత్రి వేళల్లో పట్టణంలో తిరగరాదని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన ప్రాంతాలను పరిశీలించి ప్రజలతో మమేకమయ్యారు. కార్యక్రమంలో పుత్తూరు అర్బన్, రూరల్ సీఐలు శేఖర్‌రెడ్డి, రవీంద్ర, పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం, పిచ్చాటూరు ఎస్‌ఐలు ఓబయ్య, ధర్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవ పోస్టర్‌ను ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్ వెంకట ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తారన్నారు. మండల వైద్యాధికారులు విధిగా పీహెచ్‌సీల పరిధిలో దోమల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. దోమల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..


పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకు


ట్యాంకు కట్టపైకి ప్రారంభమైన రోడ్డు పనులు

పుత్తూరు: ఎట్టకేలకు పుత్తూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. 2021 మే 18వ తేదీన ట్యాంకు కట్ట 200 మీటర్ల మేరకు కుంగింది. దీనిపై స్పందించిన ఆనాటి నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా జిల్లా అధికారులను అప్రమత్తం చేసి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి పుత్తూరు ప్రజల ప్రాణాలను కాపాడారు. పూర్తి స్థాయి మరమ్మతుల కోసం నాటి వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.9 కోట్లు మంజూరు చేయించారు. అయితే ఆనాటి కరోనా పరిస్థితుల నేపథ్యంలో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా టెండర్లు పిలిచి చేతులు దులుపుకొన్నారే గానీ పనులు ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో గత జూన్ 11వ తేదీన సాక్షి దినపత్రికలో ఎస్ఎస్ ట్యాంకుపై పొంచి ఉన్న పెనుముప్పు అన్న కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులను ప్రారంభించింది. పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతుల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వానికి ఏడాదిన్నర కాలం పట్టింది. తాడేపల్లిలోని ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అప్రూవల్స్ పూర్తికావడంతో మంగళవారం పనులు ప్రారంభించారు. ముందుగా ఎస్ఎస్ ట్యాంకుపైకి మెటీరియల్ వెళ్లడానికి రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మరమ్మతు పనులు పూర్తి చేయడానికి కాంట్రాక్టర్‌కు ఆరు నెలల వ్యవధి ఇచ్చారు.

టీడీ ఇంజక్షన్‌తో వ్యాధి నిరోధక శక్తి


ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు టీడీ ఇంజక్షన్ వేస్తున్న ఏఎన్‌ఎం

పాలసముద్రం: టీటీ, టీడీ ఇంజక్షన్లు వేయడంతో విద్యార్థుల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారులు మోహన్‌క్రిష్ణ, జయకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలో నాలుగు గ్రూపులుగా మండల పరిధిలోని 10, 16 సంవత్సరాల విద్యార్థులకు టీటీ, టీడీ ఇంజక్షన్ వేసే కార్యక్రమం నిర్వహించారు. పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రిన్సిపల్ హేమలత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది టీడీ ఇంజక్షన్ వేశారు. హేమలత మాట్లాడుతూ 16 సంవత్సరాల విద్యార్థులు తప్పకుండా టీడీ ఇంజక్షన్ వేసుకోవాలన్నారు. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. 10 సంవత్సరాల విద్యార్థులకు టీటీ, 16 సంవత్సరాల విద్యార్థులకు టీడీ ఇంజక్షన్ వేస్తామని తెలిపారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు ఇంజక్షన్లు వేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాధ, ఆశా అములు, విద్యార్థులు పాల్గొన్నారు.

తమ్ముడిపై అన్న దాడి

బంగారుపాళెం: మండలంలోని కొరివారిపల్లె మంగళవారం సాయంత్రం తమ్ముడిపై అన్న దాడి చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. దళితవాడకు చెందిన చిన్నస్వామి అతని తమ్ముడు శంకరయ్య మధ్య పొలం తగాదా ఉంది. ఈ నేపథ్యంలో పొలం విషయమై తగాదా పడ్డారు. దీంతో చిన్నస్వామి కుటుంబ సభ్యులు రాణెమ్మ, రవి, హరి తమ్ముడు శంకయ్య, అతని కుమారుడు నవీన్‌పై దాడి చేసి గాయపరిచారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. బాధితుడు శంకరయ్య ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో మంగళవారం సాయంత్ర పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గల ఓ మామిడితోటలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందినట్లు తెలిపారు. దీంతో సిబ్బందితో కలసి పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.6,150 నగదు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

పంటల సాగుపై అవగాహన

తవణంపల్లె: ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని సరకల్లు, గురుకువారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో కలుపును తొలగించాలని సూచించారు. పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పంటలకు మోతాదుకు మించి ఎరువులు వాడరాదని సూచించారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సిబ్బంది, ఏఈఓ కుసుమ, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రవీణ్

విద్యార్థుల అవస్థలు


పాఠశాల గేటు ఎదుట నిలిచిన వర్షపు నీరు

పాలసముద్రం: ప్రభుత్వ ఉన్నత పాఠశాల గేటు వద్ద ఉన్న వర్షపు నీటి నిలిచిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి పాఠశాల గేటు వద్ద వర్షపు నీరు నిండిపోయి బురదతో నిండిపోయింది. సైకిల్‌పై వచ్చే విద్యార్థులు కూడా బురదలో పోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే బురద నీటిని దాటుకుని వెళ్లాల్సిందే. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల గేటు ఎదుట వర్షపునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.